కళాశాల భూమిని కాపాడాలి

డిప్యూటీ తహసీల్దార్ రోజాకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

భిక్కనూరు, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన భూమిని కాపాడాలని ఏబీవీపీ భిక్కనూరు శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ రోజాకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కామారెడ్డి స్టూడెంట్ ఫర్ సేవా టౌన్ ప్రెసిడెంట్ గంధం సంజయ్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలను పది ఎకరాల్లో ఏర్పాటు చేశారని, కొందరు కాలేజీ భూముల్లోకి అక్రమంగా వచ్చి వెంచర్లు ఏర్పాటు చేసేందుకు హద్దులు పాతారని తెలిపారు. అధికారులు స్పందించి భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు రాజేందర్, యోగేశ్, ఆదర్శ్, సాయికుమార్, సాయి, రాకేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

భిక్కనూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో సాగవుతున్న వరి పంటను ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి శనివారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటకు సోకే మోగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రభుత్వ బాలుర పాఠశాల పరిశీలన

దోమకొండ, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలను దోమకొండ గడీకోట ట్రస్ట్ చైర్మన్ కామినేని అనిల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ.. పాఠశాలలో మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, మరమ్మతు పనులకు సహకారం అందించాలని ట్రస్ట్ వారిని కోరినట్లు తెలిపారు. గడీకోట ట్రస్ట్ చైర్మన్ పాఠశాలను పరిశీలించి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రస్ట్ ద్వారా మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేయిస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బాబ్జీ, ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న ట్రస్ట్ చైర్మన్ కామినేని అనిల్

మత్తు పదార్థాల నిరోధానికి కృషి చేయాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 24 : మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. యువత, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు రవాణా కాకుండా చూడాలన్నారు. సంబంధించి శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బావయ్య, జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం, విద్య, వైద్యం, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

రాజంపేట్/గాంధారి, ఫిబ్రవరి 24 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాయకులు శనివారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సల్మాన్, మండల నాయకులు ప్రణీత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీరయ్య, ఎంపీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండలంలోని గుడిమేట్‌లో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తూర్పు రాజు, సొసైటీ డైరెక్టర్ లక్ష్మణ్, ఈశ్వర్‌గౌడ్, ఆర్ల మధు బాబూరావు, మహేశ్, శివాజీ పాల్గొన్నారు.

గండివేట్‌లో పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

మాచారెడ్డి, ఫిబ్రవరి 24 : మండలంలోని రాజ్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన భూపతి రెడ్డి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి బాధితుడికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఇప్పటి వరకు 35 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్

28న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 24 : బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న యాక్సిస్ బ్యాంకు, ప్రోమైండ్ స్కిల్ క్యాటలిస్ట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. జాబ్‌మేళా కరపత్రాలను అధ్యాపకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. డిజిటల్ ఆఫీసర్స్, కస్టమర్ సెల్స్ అడ్వైజర్స్ తదితర పోస్టులు ఉన్నాయని తెలిపారు. డిగ్రీ, ఆపైన విద్యార్హత ఉన్న నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కామారెడ్డి, ఫిబ్రవరి 24 : కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో సాందీపని డిగ్రీ కళాశాలకు చెందిన ఉదయ్ కిరణ్ మొదటి స్థానం సాధించి బంగారు పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల యాజమాన్యం శాలువా, మెమెంటోతో శనివారం సత్కరించింది. హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈయన పాల్గొంటారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు బాలాజీరావు, ప్రిన్సిపాల్ సాయిబాబు, అకాడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

మురికి కాలువలను శుభ్రం చేయించాలి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 24 : ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు గ్రామంలోని మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఎంపీడీవో బషీరుద్దీన్ పంచాయతీ కార్యదర్శి సచిన్‌కు సూచించారు. మండలంలోని పోచారం గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఇప్పటి వరకు వసూలు చేసిన పన్ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పన్నులను సకాలంలో వసూలు చేయాలని కార్యదర్శికి సూచించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

దోమకొండ, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సిస్టర్స్‌గా విధులు నిర్వహించిన కెరోలిన్, సుమతి బదిలీపై వెళ్తున్న సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. సిస్టర్స్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దవాఖాన వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 24 : రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్, డిగ్రీ, డీఎడ్ ప్రొఫెషనల్ కళాశాలకు సంబంధించి రూ.5,500 కోట్ల పెండింగ్ ఫీజులను విడుదల చేయాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శనివారం ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రంలోని సుమారు 2000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజులను చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజులను విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలల్లో ఉన్న అధ్యాపకులకు జీతాలు లేక, అద్దెలు కూడా కట్టలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి బాలు, కరీంనగర్, జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు రాజిరెడ్డి, అంజల్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ పటేల్, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

అభివృద్ధి పథంలో గ్రంథాలయం

- బిచ్కుందలో కొత్త భవనం ఏర్పాటు
- రోజురోజుకూ పెరుగుతున్న పాఠకులు
- సద్వినియోగం చేసుకుంటున్న నిరుద్యోగ యువత

బిచ్కుంద, ఫిబ్రవరి 24: 'గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు..' అనే నానుడికి అనుగుణంగా ప్రభుత్వం ప్రధానమైన పట్టణాలు, గ్రామాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నది. పల్లె ప్రజలకు సైతం విజ్ఞానాన్ని అందిస్తున్నది. ఈ క్రమంలోనే బిచ్కుందలో 1972లో ఓ ప్రైవేటు గదిలో లైబ్రరీ ప్రారంభమైంది. పాఠకుల ఆదరణ పెరగడంతో రోజురోజుకూ అభివృద్ధి బాటలో పయనిస్తున్నది. 54 ఏండ్ల క్రితం కేవలం పది పుస్తకాలు, రెండు పేపర్లతో ప్రారంభమైన ఈ గ్రంథాలయానికి నేడు పాఠకుల తాకిడి పెరిగింది. దీంతో చిన్న గదిలో ఉన్న గ్రంథాలయానికి అప్పటి ఎమ్మెల్యే హన్మంత్‌షిండే సొంత భవనం మంజూరు చేయించారు. పాత లైబ్రరీ భవనం గ్రామానికి దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లడానికి పాఠకులు కూడా ఇష్టపడేవారు కాదు. భవనం కోసం రూ.2.75లక్షలను మంజూరు చేయించారు. దీంతో భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగి ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. కొత్తగా నిర్మించిన భవనంలో పాఠకులకు అన్ని రకాల వసతులను కల్పించారు. అన్ని హంగులు ఉండడంతో నిరుద్యోగుల తాకిడి కూడా పెరిగింది. గత ప్రభుత్వం వరుస నోటిఫికేషన్లు జారీ చేయడంతో లైబ్రరీకి వచ్చి చదువుకునే నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. అందుకు అనుగుణంగా గ్రంథాలయానికి పుస్తకాలు కూడా వచ్చాయి. ప్రస్తుతం ఈ లైబ్రరీలో 16,500 పుస్తకాలు ఉండగా.. ప్రతిరోజూ ఏడు దినపత్రికలు వస్తున్నాయి. రోజూ గ్రంథాలయానికి 70 మంది పాఠకులు వస్తున్నారు. ఉద్యోగ ప్రకటనలు వెలువడడంతో లైబ్రరీని ప్రతి రోజూ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు తెరిచి ఉంచుతున్నారు.

బిచ్కుందలోని గ్రంథాలయం, లైబ్రరీలో పాఠకులు

పాఠకుల సంఖ్య పెరిగింది..

2010 నుంచి 2023వరకు గ్రంథాలయం గ్రామ చివరలో ఉండడంతో పాఠకులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం కొత్త భవనంలోకి మారడం, గ్రామ సమీపంలోనే ఉండడంతో పాఠకుల సంఖ్య పెరిగింది. నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలు, దిన పత్రికలు అందుబాటులో ఉంచుతున్నాం.

- నిసార్, గ్రంథ పాలకుడు

అధికారులు స్థానికంగా ఉంటూ

మెరుగైన సేవలను అందించాలి

పిట్లం మండల సభలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం, ఫిబ్రవరి 24: మండలంలోని అన్ని శాఖల అధికారులు స్థానికంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను చదివి వినిపించారు. సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులను ఎమ్మెల్యే సూచించారు. మండలంలో నిరుపేదలపై కేసులు చేస్తే సహించేది లేదని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది కొరత ఉన్నదని సభ్యులు తెలుపగా.. త్వరలోనే దవాఖానలో సిబ్బంది కొరత తీరుస్తామని చెప్పారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండకుండా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, విండో చైర్మన్ శపథంరెడ్డి, ఎంపీడీవో కమలాకర్, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

ఇష్టంతో చదవాలి..

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. పిట్లం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్సెస్సీ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. చదువుతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. పాఠశాలలోని పలు సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, జంబిగె హన్మాండ్లు, ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, ప్రవళిక, ఎంఈవో దేవీసింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, AKULA MANEESH GOUD S/o. AKULA MARUTHI NANDAN GOUD R/o. H.No.4-51/4, Ramadugu, Dharpally, Nizamabad, T.S., Change my new name as JAKRANPALLY MANISH GOUD S/o. JAKRANPALLY MARUTHI NANDAN GOUD
NTZ-318641

CHANGE OF NAME

★I, AKULA KAVITHA R/o. H.No. 4-51/4, Ramadugu, Dharpally, Nizamabad, T.S., Change my new name as JAKRANPALLY KAVITHA W/o. JAKRANPALLY MARUTHI NANDAN GOUD
NTZ-318643

CHANGE OF NAME

★I, SHATPALLY BOJESHWAR (Old Name) S/o. LIMBAIAH, H.No.1-66/65/36 (V & M) Dharpally, Dist. Nizamabad Telangana State Changed my surname as CHETPALLY BOJESHWAR S/o.LIMBAIAH (New Name)
NTZ-324722

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

ప్లాట్లు కొనబడును

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును

★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899.
NT-319957

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అధికారుల సూచన

నిజాంసాగర్, బిచ్కుందలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిజాంసాగర్/ బిచ్కుంద, ఫిబ్రవరి24: రానున్న వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిజాంసాగర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. సమ్మర్ వాటర్ ప్లాన్‌లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను ముందుగానే గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జుక్కల్ మండల పరిషత్ కార్యాలయంలో సమ్మర్ వాటర్ ప్లాన్ భాగంగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో యాదగిరి మాట్లాడుతూ.. గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

బిచ్కుందలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ అధికారి మహబూబ్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎండాకాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంకులను తప్పకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల అందజేత

విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

బాన్సువాడ, ఫిబ్రవరి 24 : పట్టణంలోని కోన బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు అవిజ్ఞ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష ప్యాడ్లను అందజేశారు.

పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి కిట్లను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు.

నాగల్‌గావ్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్, ఫిబ్రవరి 24: జుక్కల్ మండలంలోని నాగల్ గావ్, పడంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, బినామీ కూలీల హాజరు నమోదు కాకుండా పనికి వచ్చే కూలీలే చూసుకోవాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రతి రోజూ రూ.270 వరకు కూలి డబ్బులు వస్తాయని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీలను పరిశీలించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 24: జడ్పీ వైస్‌పర్సన్ దఫేదార్ శోభ జన్మదినాన్ని బీఆర్ఎస్ నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్‌నగర్‌లోని ఆమె నివాసం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు.